

# జూబ్లీహిల్స్ ఉపఎన్నిక..

# కిషన్ రెడ్డికి కీలకం !

- అభ్యర్థి ఎంపిక దాదాపు ఆయన చేతుల్లోనే!
- పార్లమెంటు నియోజకవర్గంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం



**జూబ్లీహిల్స్, అక్టోబరు8, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ప్రతిష్టాత్మకంగా మారాయి. ఒకవైపు కేంద్ర మంత్రిగా మరోవైపు ఎంపీగా ఉన్న అతని పార్లమెంటు నియోజకవర్గంలో ఈ నియోజకవర్గం భాగంగా ఉంది. దీంతో ఇక్కడ అభ్యర్థి ఎంపిక మొదలుకొని గెలుపు భారం ఆయనపై స్పష్టంగా కనిపిస్తుంది. ఈ క్రమంలోనే అభ్యర్థి ఎంపిక నిర్ణయాన్ని సైతం ఢిల్లీ పెద్దలు ఆయనకే అప్పగించినట్లు తెలుస్తుంది. మరోవైపు ఆశావాహుల్లో అత్యధికలు ఆయన గతంలో అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుంచి టిక్కెట్ రేసులో ఉన్నవారే కావడం విశేషం. ఈ సారి అభ్యర్థి ఎంపిక నుంచి మొదలుకొని పార్టీ గెలుపు వరకు ఆయనకు ఎంతో ప్రతిష్టాత్మకంగా మారింది.

**పోటీలో వీరు..**

జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసిన ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు లంకాల దీపక్‌రెడ్డితోపాటు గత ఎన్నికల్లో ఆవావాహులుగా ఉన్న జూటూరు కీర్తిరెడ్డి, వీరపనేని పద్మ ఈ సారి టిక్కెట్ రేసులో ఉన్నారు. వీరితోపాటు మరికొందరు పేర్లు సైతం వినిపిస్తున్నాయి. గత పార్లమెంటు ఎన్నికల్లో హైదరాబాద్ ఎంపీ అభ్యర్థిగా పోటీచేసి ఓడిన మాధవిలత జూబ్లీహిల్స్ ఎన్నికల ఆశావాహుల బరిలో తాను ఉన్నానంటూ స్పష్టం చేశారు. లిస్టులో తన పేరు ఉందంటూ మీడియా ముందు స్పష్టం చేశారు. దీనికితోడు బీజేపీలో అభ్యర్థిని ఎంపిక చేసేందుకు ఇప్పటికే త్రిసభ్య కమిటీని సైతం పార్టీ ఏర్పాటుచేసింది.


ఒకవైపు ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటికి పార్టీ ఇంకా అభ్యర్థిని నిర్ణయించలేకపోయింది. ప్రజాభిప్రాయ, పార్టీ నేతల అభిప్రాయ సేకరణ పూర్తైన తరువాతనే అభ్యర్థిని ప్రకటిస్తామని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి.

**జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచే అత్యధికం**

గత పార్లమెంటు ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంటు పరిధిలో పోస్టల్ ఓట్లతో కలిపి మొత్తం 1047659 ఓట్లు పోలయ్యాయి. ఇందులో బీజేపీ నుంచి బరిలో నిలిచిన కిషన్‌రెడ్డికి అత్యధికంగా 468311 ఓట్లు పోలవ్వగా కాంగ్రెస్ బీఫారం మీద బరిలో నిలిచిన దానం నాగేందర్‌కు 420220 ఓట్లు పోలయ్యాయి. బీజేపీకి ఇక్కడి నుంచి మొత్తం 45.15 ఓటు శాతం రాగా కాంగ్రెస్‌కు 40.38 శాతం ఓట్లు పోలయ్యాయి. బీఆర్ఎస్ నుంచి పోటీచేసిన పద్మారావుకు 128680 ఓట్లతో 12.37 ఓటింగ్ శాతం నమోదైంది. అయితే 2023లో జరిగిన ఎమ్మెల్యే ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ మెజార్టీ ఓట్లను సాధించి ఈ స్థానాన్ని గెలుచుకొంది. కాగా పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటు శాతం తగ్గిపోయి బీజేపీకి, కాంగ్రెస్‌కు మళ్లింది. దీనికితోడు కిషన్‌రెడ్డికి ఈ నియోజకవర్గం నుంచి 25వేలకు పైగా మెజార్టీ లభించింది.

**భారమంత అతనిపైనే..**

తన సొంత పార్లమెంటు నియోజకవర్గం కావడంతోపాటు కిషన్‌రెడ్డి చాలా కాలంగా ఈ నియోజకవర్గంలో వివిధ కార్యక్రమాల పేరుతో పర్యటిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ బీజేపీ నేతలను, కార్యకర్తలను నేరుగా కలుసుకొని మాట్లాడుతున్నారు. ఉప ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారడంతోపాటు గత రెండు దఫాలుగా ఎమ్మెల్యేఎన్నికల్లో బీజేపీ ఓటింగ్ శాతం పెరుగుతూ వచ్చింది. 2018లో జరిగిన ఎమ్మెల్యే ఎన్నికల్లో అభ్యర్థిగా బరిలో నిలిచిన రావుల శ్రీధర్‌రెడ్డి 8517 ఓట్లను సాధించి 5.5 ఓటు శాతాన్ని సాధించారు. కాగా 2023 ఎన్నికల్లో బీజేపీకి ఓటు శాతం గణనీయంగా పెరిగింది. ఈ ఎన్నికల్లో బరిలో నిలిచిన లంకాల దీపక్‌రెడ్డికి 14.11 ఓటు శాతంతో 25,866 ఓట్లను సాధించారు. మోది ప్రభావం, కిషన్‌రెడ్డి పర్యటనలు, నియోజకవర్గం అభివృద్ధి కోసం నిధుల కేటాయింపు తదితర అంశాలతోపాటు సరైన అభ్యర్థిని నిలిపి గెలుపు బావుటా ఎగురవేయాలని కిషన్‌రెడ్డి ఆలోచిస్తున్నారు.



# హైదరాబాద్ వార్త

## ఉపఎన్నిక పారదర్శకంగా జరిగేలా పార్టీలు సహకరించాలి

-ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి ప్రచారం చేయాలి
-షేక్‌పేట్ ఎమ్మార్వో ఆఫీసులో రిటర్నింగ్ అధికారి కార్యాలయం
-13నుంచి నామినేషన్లను స్వీకరిస్తాం
-జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి.కర్ణన్, జాయింట్ పోలీస్ కమిషనర్ తప్సీర్ ఇక్బాల్

**హైదరాబాద్,అక్టోబరు 8,ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా జరిగేందుకు రాజకీయ పార్టీలు, ప్రతినిధులు సహకరించాలని 4 కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలను తప్పక పాటించాలనీ జిల్లా ఎన్నికల అధికారి ఆర్ వి కర్ణన్ కోరారు. ఈమేరకు బుధవారం జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్ లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఉప ఎన్నిక షెడ్యూల్ ను, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారికి వివరించారు. ఈ సందర్భంగా కర్ణన్‌మాట్లాడుతూ.... ఈ నెల 6 వ తేదీన ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన వెంటనే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి వచ్చిందన్నారు.ఆ వెంటనే జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ , ప్రైవేట్ ప్రాపర్టీల పై ఉన్న రాజకీయ పార్టీల బ్యానర్ లు, పోస్టర్ లు తొలగించడం ప్రారంభించామన్నారు.ఎన్నికల ప్రవర్తన నియమావళికి లోబడి రాజకీయ పార్టీలు, ప్రతినిధులు ఎన్నికల ప్రచారం నిర్వహించాలన్నారు. స్వేచ్ఛాయుత, పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ కోసమే కేంద్ర ఎన్నికల సంఘం మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పెట్టిందన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘనలు లేకుండా పార్టీలు, ప్రతినిధులు తమవంతు సహకారం అందించాలన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘనలు జరిగితే బాధ్యులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ప్రభుత్వ ప్రాపర్టీ లపై ఎలాంటి రాజకీయ ప్రకటనలు ఏర్పాటు చేయవద్దన్నారు. ప్రైవేట్ ప్రాపర్టీ లపై ప్రచార ప్రకటనలు పెడితే అనుమతి తీసుకోవాలన్నారు. అంతేకాకుండా సంబంధిత ఖర్చును బాధ్యుల పార్టీ ఖాతాల్లో వేస్తామని చెప్పారు. రాజకీయ పార్టీలు తమ ప్రచార ప్రకటనలకు ఎంసిఎంసీ అనుమతి తీసుకోవాలన్నారు. అలాగే షేక్ పేట తహసీల్దార్ ఆఫీస్ లో రిటర్నింగ్ అధికారి కార్యాలయం ఏర్పాటు చేశామనిఈ నెల 13 నుంచి నామినేషన్ లు స్వీకరిస్తామని చెప్పారు. అలాగే అభ్యర్థుల నేర చరిత్ర, తమ అభ్యర్థుల పై పెండింగులో ఉన్న కేసులతోపాటు నేర స్వభావం గురించి రాజకీయ పార్టీలుమీడియాలో వెల్లడించాలన్నారు. ఒక వేళ నేర స్వభావం ఉన్న వారిని అభ్యర్థులుగా పెడితే అటువంటి వారిని ఎందుకు ఎంపిక చేసుకున్నారో? అనే విషయాన్ని తెలియజేయాలన్నారు.అలాగే ఎవరైనా ఓటర్లను ప్రభావితం చేసేందుకు నగదు, లిక్కర్ పంపిణీ , ఇతరత్రా ప్రలోభాలు నియోజకవర్గం వెలుపల చేస్తున్నట్లు గుర్తిస్తే చర్యలు తీసుకుంటామని కర్ణన్ తెలిపారు.సమావేశంలో ఎన్నికల అదనపు కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, డీసీపీ అపూర్వ రావు, రిటర్నింగ్ అధికారి పి సాయిరాం, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ముసారాంబాగ్ ఓల్డ్ బ్రిడ్జ్ ఇక లేనట్లే..!

వరదలకు ప్రమాదకరంగా మారిన వంతెన రెయిలింగ్, క్రాక్స్,పెచ్చులూడిపోయిన వైనం పునరుద్దరణ కష్టమని తేల్చిన జిహెచ్ఎంసి



**హైదరాబాద్, అక్టోబరు 8,ప్రభాతవార్త:** మూసారాంబాగ్ ఓల్డ్ బ్రిడ్జి ప్రస్థానంత్వరలో ముగియనుంది. దీన్ని కూల్చివేసేందుకు జిహెచ్ఎంసి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వచ్చిన వరదలకు పాడైన మూసారాంబాగ్ బ్రిడ్జి..కొద్దిరోజుల క్రితం రెండు మూడురోజులపాటు వచ్చిన మూసీ వరదలకు బ్రిడ్జి పైన ఉన్న రోడ్డు పూర్తిస్థాయిలో డామేజ్ అయ్యింది. అలాగే బ్రిడ్జి పై అనేక క్రాక్స్ వచ్చి పెచ్చులుడిపోయాయి. అలాగే రెలింగ్, బ్రిడ్జ్ కున్న ఐరన్ తెలి ప్రమాదకర స్థాయిలోకి చేరింది.ఈంతో బ్రిడ్జ్ స్టెబిలిటీ పై స్టడీ చేసిన జిహెచ్ఎంసి ప్రాజెక్ట్స్ వింగ్ అధికారులు పాత బ్రిడ్జ్ పునరుద్ధరించడం కష్టమే అని తేల్చారు. దీంతో మూసారాంబాగ్ బ్రిడ్జి పై రాకపోకలు పూర్తి స్థాయిలో బంద్ చేయాలని నిర్ణయించారు. ఏప్రమాదం జరగకుండా బ్రిడ్జికి ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనాలను దారి మళ్లిస్తున్నారు. కాగా 40 ఏళ్ల క్రితం నిర్మించిన మూసారాంబాగ్ బ్రిడ్జ్‌దశాబ్దాలుగా దిల్ సుఖ్ నగర్, అంబర్ పేటల రాకపోకలకు వారధి గా నిలిచింది. అలాగే మూసారాంబాగ్ బ్రిడ్జ్‌మూసీ పై కొత్తగా నిర్మాణం మొదలు పెట్టి దాదాపు మూడేళ్ళు అయ్యింది. 52 కోట్ల రూపాయలతో బ్రిడ్జ్ నిర్మాణం చేపట్టినా అది ఇప్పటి వరకు పూర్తికాలేదు. దాదాపు 220 మీటర్ల పొడవు ఉన్న ఓల్డ్ బ్రిడ్జిని కూల్చేసి కొత్త బ్రిడ్జి పనులు వేగవంతం చేస్తామని జిహెచ్ఎంసి అధికారులు తెలుపుతున్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులపై హైడ్రా కమిషనర్ క్షేత్రస్థాయి పర్యటన

-ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ ప్రాంతాల్లో పరిశీలన
-స్థానికులతో సంప్రదింపులు..అక్రమని తేలితే వెంటనే ఆదేశాలు



**హైదరాబాద్, అక్టోబరు 8,ప్రభాతవార్త:** ప్రజావాణి ఫిర్యాదులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7.30 వరకు తూముకుంట మున్సిపాలిటీ, శేరిలింగంపల్లి మండలంలోని పలు వాగులు, చెరువులను పరిశీలించారు. దేవరాయాంజాల్ విలేజ్ లో సర్వే నంబర్ 135, 136లలో రహదారిలో ఆటంకాలు కలిగిస్తున్న వివాదంపై హై కోర్టు ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. అదే మార్గంలో కొత్తగా కోర్టు భవనం, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వస్తున్న క్రమంలో రహదారిని వెంటనే పునరుద్ధరించాలని స్థానిక మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అనంతరం దేవరాయాంజాల్ విలేజ్లోని వరద కాలువ ఆక్రమణలను పరిశీలించారు. వరద కాలువ వాస్తవ వెడల్పు ఉండేలా...తుర్కవాణి కుంట నుంచి దేవరాయాంజాల్ చెరువుకు వెళ్లే వరద కాలువ కబ్జా కావడంతో 4 కాలనీలు నీట మునుగుతున్నాయని స్థానికులు ఫిర్యాదు చేసారు. గ్రామ రికార్డ్స్, సర్వే ఆఫ్ ఇండియా, ఎన్ ఆర్ ఎస్ సి మ్యాపుల ఆధారంగా గతంలో ఎంత విస్తీర్ణంలో ఉండేదో చూసి. ఆక్రమణలు తొలగించి వరద కాలువను పునరుద్ధరించాలని హైడ్రా కమిషనర్ ఆదేశించారు. తర్వా తూముకుంట విలేజ్లోని వాసవి సుచిర్ ఇండియా లేపుట్లో నాలా కుంచించుకుపోవడాన్ని హైడ్రా కమిషనర్ పరిశీలించారు. దేవరాయాంజాల్ చెరువు, పోతాయిపల్లి చెరువు నుంచి గుండ్లకుంట చెరువుకు వెళ్లే వరద కాలువ వాస్తవ వెడల్పు కొనసాగించకుండా నిర్మించడాన్ని పరిశీలించారు. 9 మీటర్ల వెడల్పుతో ఉండాల్సిన నాలా 2 మీటర్లకే పరిమితం చేయడం వల్ల అదే వెంచర్లోని ప్లాట్లతో పాటు పై భాగంలో ఉన్న నివాసాలు కూడా మునిగిపోతున్నాయని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. ఇటీవల వర్షాలకు నీట మునిగిన వీడియోలు చూపించారు. ఓపెన్ నాల ఉండాల్సిన చోట పైపులు వేయడంతో ఈ సమస్య తలెత్తిందని అధికారులు చెప్పారు. అందరితో సమావేశం ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. నల్లగండ్ల పెద్ద చెరువుకు వచ్చే వరద కాలువ కబ్జా అవ్వడంతో పాటు చెరువునుంచి బయటకు వెళ్ళే నీటి దారులను కూడా మార్చారని వచ్చిన ఫిర్యాదులను పరిశీలించారు. నల్లగండ్ల చెరువును అభివృద్ధి చేసే క్రమంలో అపర్ణ నిర్మాణ సంస్థ అలుగులు మార్చారని, చెరువులోని బండ్ నిర్మించారని ఫిర్యాదులపై కూడా స్థానికులతో విచారించారు. అనంతరం గోపన్నపల్లిలోని చిన్న పెద్ద చెరువు కబ్జాలు కూడా పరిశీలించారు. యిలా అన్ని ఫిర్యాదులపైనా ఇరిగేషన్, మున్సిపాలిటీ అధికారులతో పాటు నిర్మాణ సంస్థ ల ప్రతినిధులు, స్థానికులతో త్వరలో సమావేశం ఏర్పాటు చేసి సమస్యకు పరిష్కారం చూపుతామని కమిషనర్ హామీ ఇవ్వడంతో స్థానికులు ఊరట చెందారు. ఈపర్యటనలో హైడ్రా అదనపు కమిషనర్ ఎన్. అశోక్ కుమార్,అదనపు సంచాలకులు వర్ల పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

# వాహన తనిఖీల్లో.. చిక్కుతున్న డబ్బులు

- రూ.6.26 లక్షలు స్వాధీనం



ఫిల్మ్‌నగర్ ప్రాంతంలో తనిఖీల్లో పోలీసు ఉన్నతాధికారులు

**జూబ్లీహిల్స్, అక్టోబరు 8, ప్రభాతవార్త:** ఎన్నికల నియమావళి నేపథ్యంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. నియోజకవర్గ పరిధిలోకి వచ్చే అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇప్పటికే పోలీసులు వాహన సంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. పోలీసులతో పికెట్ లు ఏర్పాటుచేసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఫిల్మ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నారాయణమ్మ కళాశాల సమీపంలో అదనపు కమిషనర్ ఇక్బాల్, పశ్చిమ మండల డీసీపీ చింతమనేని శ్రీనివాస్, బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకటరెడ్డి, ఫిల్మ్ నగర్ ఇన్‌స్పెక్టర్ సంతోషంలతో కలిసి నిర్వ హించిన తనిఖీల్లో భాగంగా లెక్కలు చూపని రూ. 1.66లక్షల నగదును కిరణ్‌కుమార్ రెడ్డి అనే వ్యా పారి నుంచి స్వాధీనం చేసుకున్నారు. పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీనగర్‌కాలనీలో నిర్వహించిన తనిఖీల్లో భాగంగా కారులో 4.6లక్షల నగదును, 9 ఖరీదైన మద్యం సీసాలను స్వాధీ నం చేసుకున్నారు. పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఎన్నికల నిబంధనల నేపథ్యంలో నగదు లావాదేవీలపై ని ఘా పెట్టినట్లు బంజారాహిల్స్ ఏసీపీ వెంకటరెడ్డి సామల తెలిపా రు. ప్రయాణ సమయంలో నగదు ఎన్నికల నిబంధ నలకు మించి నగదు తీసుకెళ్లే వారు ఖచ్చితంగా తగిన పత్రాలను చూపాలని సూచించారు.

## నెమలినగర్‌లో అక్రమ కట్టడాలు కూల్చివేత

- ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నిస్తే ఉక్కుపాదం మోపుతాం : తహసీల్దార్



పుప్పాలగూడలోని నెమలీనగర్‌లో అక్రమ కట్టడాలు కూల్చివేసిన గండిపేట మండల రెవెన్యూ అధికారులు

**నార్సింగి, అక్టోబర్ 8 ప్రభాతవార్త :** గండిపేట మండలం పుప్పాలగూడలోని నెమలీనగర్‌లో వెలిసిన ఆరు అక్రమ కట్టడాలను బుధవారం గండిపేట మండల రెవెన్యూ అధికారులు నేలమట్టం చేశారు. పుప్పాలగూడ గ్రామ సర్వే నెంబర్ 290.లో ఇటీవల 6.కట్టడాలను నిర్మించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి వాటిని కూల్చివేయాలని సిబ్బందికి ఆదేశించారు. బుధవారం ఉదయం పోలీసు బందోబస్తుతో వెళ్లి జేసీబీ సహాయంతో కట్టడాలన్నింటిని నేలమట్టం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ స్థలంను కబ్జా చేయాలని చూస్తే ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. ప్రభుత్వ స్థలాలు భావి తరాల అవసరాల కోసం ఉపయోగించుకోవాలని, ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు రేయింబవళ్లు రెవెన్యూ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. కబ్జాకోరులు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, చట్టపరిధిలో కఠినంగా వ్యవహరిస్తామని తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు.

## శాంతి పరిరక్షణకు అధిక ప్రాధాన్యం : విసి.సజ్జనార్

**హైదరాబాద్,అక్టోబరు8,ప్రభాతవార్త:** హైదరాబాద్ నగరంలో శాంతి పరిరక్షణలకు అధిక ప్రాధన్యత ఇస్తాను అని తెలిపారు. ఈక్రమంలో నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ వాహనదారులకు పలు సూచనలు చేస్తున్నారు. నూతన బాధ్యతలు స్వీకరించిన ఆయన మీడియాతో నగరంలో చాలా మంది వాహనదారులు,క్యాబ్, ఆటో డ్రైవర్లు డ్రైవింగ్ చేసేటప్పుడు హెడ్ సెట్, ఇయర్ ఫోన్స్ వంటివి వాడుతున్నారని, ఇకపై ఇలాంటి వారు కంటపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిత్యం ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదాలు సంభవిస్తూనే ఉన్నాయి. మనం ఎంత జాగ్రత్తగా ఉన్నా అవతలి వారి నిర్లక్ష్యం కారణంగా కొన్ని సందర్భాల్లో ప్రమాదాల బారిన పడాల్సి వస్తుందని పేర్కొన్నారు. కొందరి నిర్లక్ష్యం ఎందరో జీవితాలను నాశనమవుతున్నాయని అన్నారు. డ్రైవింగ్ చేసే సమయంలో చాలా మంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం, వాహనం నడుపుతూ మొబైల్ మాట్లాడటం చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి వాటితోనే ప్రమాదాలు చోటు చేసుకుంటాయని వివరించారు.ముఖ్యంగా డ్రైవింగ్ చేస్తున్నప్పుడు మొబైల్ ఫోన్‌లో వీడియోలు చూడటం, ఇయర్‌ఫోన్లు వాడటం నేరమని తెలిపారు. వాహనాలు నడుపుతూ ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సజ్జనార్ స్పష్టం చేశారు.

## తల్లితో అక్రమ సంబంధం...!

-యువకుడి దారుణ హత్య

**అత్తాపూర్ అక్టోబరు8,ప్రభాతవార్త :** అక్రమ సంబంధం ఓ యువకుడి దారుణ హత్యకు దారి తీసిన ఘటన రాజేంద్రనగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్స్పెక్టర్ క్యాస్ట్రో తెలిపిన వివరాల ప్రకారం... ఉప్పర్‌పల్లి ఫోర్ట్యూ కాలనీలో ఓ అపార్ట్మెంట్ లో నివాసం ఉండే యాసిర్ (28) యూట్యూబ్ ఛానల్ లో పనిచేస్తున్నాడు. అయితే అదే అపార్ట్మెంట్ లో ఉండే ఓ మహిళతో (40) యాసిర్ అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. విషయం తెలిసన భర్త భార్యతో తరచూ గొడవ పడుతున్నాడు. బుధవారం సాయంత్రం కుమారుడు తన తల్లితో కలిసి ఉన్న యాసిర్‌ను చూసి కోపోద్రిహుడై కత్తితో దాడి చేశాడు. దీంతో యాసిర్ తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు.స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి వివరాలను సేకరించారు.పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అక్రమ ఆయుధాలు వినియోగిస్తున్న ఇద్దరు అరెస్ట్



పోలీసులు స్వాధీనం చేసుకున్న తుపాకులు

**హైదరాబాద్,అక్టోబరు8,ప్రభాతవార్త** దేశీయ తుపాకులను వినియెగిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఫలక్‌నుమా పోలీసులతో కలిసి స్పెషల్ క్రైం బృందం అదుపులోకి తీసుకుంది. బుధవారం స్పెషల్ క్రైం ఇన్‌స్పెక్టర్ డి.భిక్షపతి తెలిపిన వివరాల ప్రకారం ఝార్ఖాండ్ రాష్ట్రానికి చెందిన విజయ్‌యాదవ్ (25) చందానగర్‌లో అద్దె ఇంట్లో ఉంటూ బార్లలో పండ్లు విక్రయిస్తుంటాడు. అదేవిధంగా అదే రాష్ట్రానికి చెందిన బంటికుమార్ యాదవ్ (22) సంతోష్‌నగర్‌లో ఉంటూ ఆయన మాదిరిలా పండ్లను అమ్మకాలు చేపట్టే వ్యాపారాలు నిర్వహిస్తున్నాడు. అయితే మూడు నెలల క్రితం విజయ్‌యాదవ్‌కు పరిచయస్తుడు అయిన బీహార్‌కు చెందిన సోనుకుమార్ నుంచి రూ.58వేలకు దేశీయ పిస్తోల్‌ను కొనుగోలు చేశాడు. దీన్ని వేరేవారికి విక్రయించేందుకు కొనుగోలు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. పోలీసులకు పట్టుబడితే లైసెన్స్‌లు చూపించేందుకు అక్రమంగా లైసన్సులను సిద్దం చేశారు. విశ్వసనీయ సమాచారంతో పోలీసులు నిఘాపెట్టి అక్రమంగా ఆయుధాలు ఉన్న వారిని అరెస్ట్ చేసి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. పిస్తోల్ అమ్మిన వ్యక్తి సోనుకుమార్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పిస్తోల్, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

## జూబ్లీహిల్స్‌లో నకిలీ వైద్యుడు అరెస్ట్

**జూబ్లీహిల్స్, అక్టోబరు 8, ప్రభాతవార్త:** ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా క్లినిక్ పెట్టి వైద్యం చేస్తున్న నకిలీ వైద్యుడిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. వెంకటగిరి ప్రాంతంలో వెంకటేశ్వర ఫస్ట్ ఎయిడ్ క్లీనిక్ పేరుతో ఒక వ్యక్తి వైద్యుడిగా నటిస్తూ క్లీనిక్ నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు ఈ క్లీనిక్‌పై దాడి చేశారు. క్లీనిక్‌లో వైద్యం అందిస్తున్న రహ్మత్‌నగర్‌కు చెందిన నీలి శశిధర్(32)ను అదుపులోకి తీసుకొన్నారు. అతన్ని విచారించగా శ్రీనివాస్ అనే వైద్యుడి పేరుతో నకిలీ పత్రాలు సృష్టించి శశిధర్ ఈ వైద్యం చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అతనిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బాలికపై లైంగిక దాడి

**ఫిల్మ్‌నగర్, అక్టోబరు 8, ప్రభాతవార్త:** బాలికను మోసగించి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడిన మైనర్(17)పై ఫిల్మ్‌నగర్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. ఫిల్మ్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం.. ఫిల్మ్‌నగర్‌లో నివసించే ఒక బాలికకు కొద్ది సంవత్సరాల క్రితం సమీపంలో నివసించే ఏడో తరగతి బాలుడితో పరిచయం ఉంది. ఇద్దరు కలిసి ఆడుకోవడంతోపాటు, కలిసి చదువుకొనేవారు. నాలుగేళ్ల క్రితం తాను ప్రేమిస్తున్నానంటూ బాలికను నమ్మించాడు. రెండేళ్ల క్రితం పదో తరగతి చదువుతున్న సమయంలో బాలిక బాలుడి ఇంటికి వెళ్లగా బాలుడు బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. పెళ్లి చేసుకుంటామని నమ్మించి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. కొద్ది నెలల క్రితం బాలికకు గర్భం రావడంతో బాలుడు మాత్రలతోపాటు, బొప్పాయి జ్యూస్ ఇచ్చి గర్భంస్రావం జరిగేలా చేశాడు. అనంతరం బాలుడు మరో ప్రాంతానికి ఇళ్లు మారినా అక్కడికి సైతం బాలికను తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. తాజాగా బాలిక పెళ్లి చేసుకోవాలంటూ కోరగా తన తల్లి పెళ్లికి అంగీకరించదంటూ బాలుడు తేల్చి చెప్పాడు. దీంతో బాలిక విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేసి ఫిల్మ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శ్రీకాంత్ భరత్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

**: వైశ్య వికాస వేదిక చైర్మన్ డా.కాచం సత్యనారాయణ గుప్త**



ఎసిపి కృష్ణయ్యకు పిర్యాదు చేస్తున్న కాచం

**మన్సూరాబాద్ , అక్టోబర్ 8, ప్రభాతవార్త :** జాతిపిత మహాత్మా గాంధీ పై అనుచిత వ్యాఖ్యలు, కించపరుస్తూ మాట్లాడిన సిని మా, బుల్లి తెరపై నటించే శ్రీకాంత్ భరత్ పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎల్బీనగర్ ఏసిపి కృష్ణయ్యకు వైశ్య వికాస వేదిక ఫౌండర్ చైర్మన్ డా. కాచం సత్యనారాయణ గుప్తా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ గుప్తా మాట్లా డుతూ మహాత్మా గాంధీ పై అనుచిత వ్యాఖ్యలు, అవహేళనగా సోషల్ మీడియాలో మాట్లాడడం జరిగిందని అన్నారు. కేంద్రం లో బిజెపి అధికారంలోకి వచ్చినప్పటినుండి మహాత్మా గాంధీని వివిధ సందర్భాలలో అవహేళన చేసే విధంగా మాట్లాడుతున్నా రని అన్నారు. మహాత్మా గాంధీ దేశానికి చేసిన త్యాగాలను విస్మ రించే విధంగా కుట్రలు చేస్తున్నారని అన్నారు. ఈ పది ఏళ్ల కాలంలో మహాత్మా గాంధీ పైవ్యతిరేకమైన భావజాలాలను సోష ల్ మీడియాలో వైరల్ చేస్తున్నారని అన్నారు. అతనిపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైశ్య వికాస వేదిక సభ్యులు సముద్రాల రమేష్, కాచం ఏక్ సాయి, సతీష్, రాంబాబు, కోడుమూరి దయాకర్, మురళి, కూర రమేష్, కొత్త రవి , వీరు, శ్రీకాకోళ్ల రాజు గుప్త పాల్గొన్నారు.

## భ్రమరాంబికా నగర్‌లో సిసి రోడ్డు ప్యాచ్ వర్క్ పనులు ప్రారంభం



**నేరెడ్ మెట్, అక్టోబర్ 8 (ప్రభాతవార్త):** మల్కాజిగిరి డివిజన్ భ్రమరాంబికా నగర్ శుభోదయం అపార్ట్మెంట్ వద్ద దాదాపు 8 లక్షల రూపాయల వ్యయంతో సీసీ రోడ్ ప్యాచ్ పనులు బుధవా రం ప్రారంభమయ్యాయి.ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రవణ్ మాట్లాడుతూ.. జిహెచ్ఎంసి పరిధిలో నిధుల కొరత సమస్యలు తీవ్రంగా ఉన్నప్పటికీ, సాధ్యమైనంత వరకు అభివృద్ధి పనులు చేపడుతున్నాం. ప్రతి కాలనీకి రోడ్లు, పార్కులు, మౌలిక సదుపా యాలు అందించడానికి కృషి కొనసాగుతుంది అని అన్నారు. అలాగే పార్కులు, రోడ్లను కాపాడుకోవడం ప్రజల బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. కాలనీలోని పార్కులో కొంతమంది ఆకతాయులు మద్యం సేవించి బాటిళ్లు పడేసి చెడుగుడు సృష్టిస్తు న్నారని, ఈ విషయమై కాలనీ వాసులతో కలిసి ఎస్ఐ ఉపేందర్ రెడ్డికి ఫిర్యాదు చేసాం అని పేర్కొన్నారు. రోడ్లపై మద్యం తాగి స్పీడ్‌గా వాహనాలు నడిపి ప్రజలకు ప్రమాదం కలిగించకుండా పోలీసులు పెట్రోలింగ్ పెంచాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఈ నవీన్, వర్క్ ఇన్స్పెక్టర్ రమేష్, కాలనీ నివాసులు సుబ్బా రావు, వెంకటసుబ్బయ్య, వెంకటేశ్వరరావు, సుధాకర్, నరసిం హ, బీజేపీ సీనియర్ నాయకులు నందు యాదవ్, అనంత్, నాని తదితరులు పాల్గొన్నారు.


## అవసరమైన చోట నూతన రోడ్ల నిర్మాణం



సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న శ్వేత మధుకర్‌రెడ్డి

**సైదాబాద్, అక్టోబరు 8 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ ఇంద్రప్రస్థ కాలనీలో రూ.29లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు పనులను కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి ప్రారం భించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో అవసరమైన చోట నూతన రోడ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుం దన్నారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా బిజెపి ఉపాధ్యక్షు డు జంగం మధుకర్‌రెడ్డి, కౌన్సిల్ సభ్యుడు అమర్నాథ్‌రెడ్డి, కాలనీవాసులు అశోక్‌రెడ్డి, నరహరి, జనార్ధన్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, సత్యనారాయణ, మహాత్మారెడ్డి, రాంగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## లక్ష్మినగర్ కాలనీలో సిసి రోడ్డు పనులు ప్రారంభం



సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న శ్వేత మధుకర్‌రెడ్డి

**సైదాబాద్, అక్టోబరు 8 ప్రభాతవార్త:** ఐఎస్ సదన్ డివిజన్ లక్ష్మినగర్ కాలనీలో రూ.12.50లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు పనులను కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రోడ్డు నిర్మాణంలో నాణ్యతను పాటించాలని అధికారులకు సూ చించారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా బిజెపి ఉపాధ్య క్షుడు జంగం మధుకర్‌రెడ్డి, ఎఇ శిరీష, కాలనీ వాసులు చంద్రశే ఖర్‌రెడ్డి, బాలకృష్ణ, సురేందర్, ప్రఫుల్ కుమార్, కృష్ణయ్య, మోహన్‌రావు, జీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర నూతన డీజీపీగా నియమితులైన. శివధర్ రెడ్డి గారిని కలిసి వారి కార్యాలయంలో. మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపిన.. టిపిసిసి రాష్ట్ర నాయకులు. (ఖమ్మం ఇంచార్జ్ ) కొత్త కుర్మ శివకుమార్

## ముంపు ప్రాంతాల్లో పర్యటించిన కార్పొరేటర్ ,అధికారులు

**వనస్థలిపురం. అక్టోబర్. 8. ప్రభాతవార్త.**

రాత్రి కురిసిన వర్షాలతో వినూత్న కాలనీ,గాంధీ నగర్ సౌత్, అఖిలాం డేశ్వరి కాలనీ, స్నేహమయి నగర్ కాలనీ, మరియు పరిసర కాలనీలో వర్షపు నీరు రోడ్లపై ముంపుకు గురైన నేపథ్యంలో బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి సంబంధిత ఇంజనీరింగ్ విభాగం, జలమండలి విభాగం, హైడ్రా విభాగం అధికా రులతో కలిసి కాలనీలలో పర్యటించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అడవి ప్రాంతం నుంచి భారీ వరద రావడంతో అడ్డుగా ఉన్న కట్ట తెగి వినూత్న కాలనీకుండా వరద నీరు ప్రవేశిస్తుందని అన్నారు. తద్వారా వినూత్న నగర్,గాంధీనగర్ సౌత్ అఖిలాండేశ్వరి కాలనీ స్నేహమే నగర్ పివిఆర్ కాలనీ రోడ్లపై నీరు చేరుతుందని అన్నారు. దీనికి శాశ్వత పరిష్కారం చేసే విధంగా చర్యలు తీసుకుం టున్నామని జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ గారు 15 రోజుల క్రితం ఈ ప్రాంతంలో పర్యటించి భారీ స్ట్రామ్ వాటర్ డ్రైన్ నిర్మించుకునే విధంగా ఒక ప్రణాళిక సిద్ధం చేసి నిధులు మంజూరు చేసే విధంగా కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగిందని అన్నారు మరియు తాత్కా లిక సహాయ చర్యలు కొనసాగుతున్నాయని హైడ్రా, జలమండలి, జిహెచ్ఎంసి సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని ఎక్కడ



స్నేహమయి నగర్‌లో ముంపుప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి, అధికారులు.

ముంపు మొదలైన వెంటనే సహాయక చర్యలు చేపడతారని తెలి యజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం డిఈ దామోదర్ రావు, జలమండలి జిడిఎం రాజగోపాల్, మేనేజర్ భవ్య, హైడ్రా మేనేజర్ రాజశేఖర్, జిహెచ్ఎంసి విభాగం ఏఈ కార్తీక్ మరి యు పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షులు పవన్ రెడ్డి, బీజేవైఎం అధ్యక్షులు సురేష్ కుమార్,కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీవాసులు తదితరులు ఉన్నారు.

## లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ బన్నాల గీత తదితరులు



రామంతాపూర్ డివిజన్ లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న కార్పొరేటర్ బండారు శ్రీవాణి తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 7 ప్రభాతవార్త :** ఉప్పల్ మండల పరిధిలోని పలు డివిజన్‌లకు చెందిన 224 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మిచ, షాదీ ముబారక్ చెక్కులను అందజేసినట్లు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ వాణిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు బన్నాల గీత, పన్నాల దేవేందర్‌రెడ్డి, ప్రభుదాస్, శాంతి శేఖర్ తదితరులతో కలిసి లబ్ధిదారులకు చెక్‌లు అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కళ్యాణ లక్ష్మి, షాదీముబా రక్ ద్వారా పేదింటి ప్రజలకు ఆర్థిక సహాయంగా దోహదపడుతుందని అన్నారు. ప్రతి ఒక్క లబ్ధిదారులు తీసుకున్న చెక్కులను సద్వినియో గం చేసుకోవాలని సూచించారు. కార్పొరేటర్ బన్నాల గీత మాట్లాడు తూ చిల్కానగర్ డివిజన్ కి సంబంధించిన 34 మంది లబ్ధిదారులకు చెక్‌లు అందజేసినట్లు తెలిపారు. లబ్ధిదారులు వెంటనే తమ ఖాతాలలో జమ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వాణిరెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**రామంతాపూర్‌లో..**

రామంతాపూర్‌లో కళ్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ పథకాల చెక్కులను బుధవారం స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి లబ్ధిదా రులకు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రామంతాపూర్ డివిజన్‌లో 61 మంది లబ్ధిదారులు చెక్కులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఉప్పల్ మండలంలోనే రామంతాపూర్ డివిజన్‌కు అత్యధికంగా చెక్కులు పంపిణీ కావడం పట్ల ప్రజలు ఆమె ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రతి అర్హులైన వారికి అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి: ఉప్పల

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 8 ప్రభాతవార్త:** మహిళలు అన్ని రంగాలలో అభ్యున్నతి సాధించాలని టీపీసీసీ ప్రధానకార్యదర్శి, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్త పేర్కొన్నారు. ఐవిఎఫ్ మహిళా విభాగ్ నూతన కమిటీ సభ్యుల కు బుధవారం శ్రీనివాస్‌గుప్తా నియామక పత్రాలు అందజేశారు. నూతనంగా ఎంపికైన పొలిటికల్ చైర్ పర్సన్ గీతగుప్తా, ఏపూరి జయలక్ష్మి, బువన, బువన, కమిటీ సభ్యులుగా మంజుల, సౌమ్య, రంగ సంతోషరాణి, రేణుక, శైలజ, రేణుక, సాధన, సునీత, వాణి, జ్యోతి, నీలిమ, రాణిగుప్త, నాగోల్ డివిజన్ అధ్యక్షురాలు జయశ్రీ, ప్రధాన కార్యదర్శి నీల జ్యోతిలకు ఉప్పల శ్రీనివాస్ గుప్త నియామక పత్రాలు అందజేశారు.ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ మహిళలు రాజకీయంగా ముందుకు రావాలని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆర్య వైశ్య మహిళ సోదరీమణులు జెడ్పీటీసీ, ఎంపీపీ లు, ఎంపీటీసీ, సర్పంచ్ గా పోటీ చేయాలని కాంగ్రెస్ పార్టీ తరుపున నేను అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. మహిళలు ఇంటికే



నియామక పత్రం అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

పరిమితం కాకుండా వ్యాపారంగా, ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందాలని, మరెన్నో సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో ఐ వి ఎఫ్ ప్రథమ మహిళ ఉప్పల స్వప్న, మహిళ విభాగం అధ్యక్షురాలు చందా భాగ్యలక్ష్మి, ప్రధాన కార్యదర్శి మంజుల, కోశాధికారి నళిని,అడ్వైజర్ మనిమల తదితరులు పాల్గొన్నారు.

## సుప్రీం సిజెపై దాడి చేసిన న్యాయవాది రాకేష్ కిశోర్‌ను కఠినంగా శిక్షించాలి

**సరూర్‌నగర్, అక్టోబర్ 8 ప్రభాతవార్త:**

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్‌పై దాడి చేసిన న్యాయవాది రాకేష్ కిశోర్‌ను కఠినంగా శిక్షించాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. సిజెపై దాడిని ఖండిస్తూ బుధవారం మహేశ్వరం నియోజకవర్గంలోని బాలాపూర్ చౌరస్తాలో వామపక్షాలైన సిపిఐ, సిపిఎం, సిపిఐఎంఎల్ తదితర పార్టీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఆందోళనలో భాగంగా ఆయా పార్టీల నేతలు చౌరస్తాలోని రోడ్డుపై బైఠాయించి ప్ల కార్డులను ప్రద ర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీం కోర్టు సిజెపై దాడి దేశానికే సిగ్గు చేటని అన్నారు. ప్రధాన న్యాయమూర్తిపై దాడిని భారత న్యాయ వ్యవస్థపై దాడిగా భావించాలని వారు పేర్కొన్నారు. మరో సారి ఇలాంటి దుశ్చ ర్యలు జరగకుండా ఉండేందుకు నిందితుడైన రాకేష్ కిశోర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ బాలాపూర్ మండల కార్యదర్శి ముకుం దంగారి చంద్రశేఖర్‌రెడ్డి, సిపిఎం కార్యదర్శి ఎం.యాదయ్య, సిపిఐ



బాలాపూర్ చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న వామపక్ష నేతలు

ఎంఎల్ కార్యదర్శి కొల్లూరు భీమేష్, సిఐటియు నాయకుడు దాసరి బాబు, వామపక్ష నేతలు జాతోతు రెడ్యా నాయక్, శేఖర్ యాదవ్, యాదమ్మ యాదవ్, రమావత్ చత్రు నాయక్, మోహన్, మల్లికా ర్జున్, కండ్లపల్లి నరేందర్, కొల్లూరు శంకర్, విజయ్, సురేష్, వెంక య్య, జగన్, స్వామి, నిరంజన్, జాతోతు శ్రీను నాయక్, జర్పుల శివనాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రతను పాటించాలి: చింతల



కాలనీలో పోరాడిస్తున్న సురేందర్‌యాదవ్

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 8 ప్రభాతవార్త:**

కాలనీలో పరిశుభ్రతను పాటించాలని బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేందర్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. నాగోల్ డివిజన్ పరిధిలో జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో కోఆపరేటివ్ బ్యాంక్ కాలనీ నుండి సాయినగర్ వరకు ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హయాత్ నగర్ డిప్యూటీ కమిషనర్ డి. వంశీకృష్ణ, డీఈ నీలిమ, జవాన్ దర్శన్, రమేష్. సాయి, కాలనీవాసులు సంజీవరెడ్డి, శ్రీనివాస్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి దేవాలయంలో నిర్వహించనున్న ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొనాలని దేవాలయ ట్రస్టీ శశికళ బుధవారం ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో కొత్తపేట డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు లింగాల రాహుల్ గౌడ్, కర్మన్ ఘాట్ హనుమాన్ దేవస్థానం మాజీ ధర్మకర్త మధుసాగర్ పాల్గొన్నారు.

## సబితారెడ్డిపై అసత్య ప్రచారం తగదు : బిఆర్ఎస్



సమావేశంలో మాట్లాడుతున్న రామిడి రాంరెడ్డి: పక్కన సూర్ణగంటి అర్జున్, పెద్దబావి ఆనంద్‌రెడ్డి తదితరులు ఉన్నారు

**సరూర్‌నగర్, అక్టోబర్ 8 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలో మతాలకతీతంగా అన్ని వర్గాల వారికి సమాన ప్రాధాన్యతనిస్తూ అభి వృద్ధికి పాటుపడుతున్న మాజీ మంత్రి, నియోజకవర్గ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిపై అసత్య ప్రచారం చేయడం బిజెపి నేతలకు తగ దని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి, కార్పొరేషన్ బిఆర్ఎస్ మాజీ ఫ్లోర్ లీడర్ సూర్ణగంటి అర్జున్‌లు హితవు పలికారు. బడంగ్‌పేట్ పెద్దబావి మల్లారెడ్డి గార్డెన్స్ లో మాజీ ఎంపిటిసి పెద్దబావి ఆనంద్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు ఏను గు రాంరెడ్డి, పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, యువ నాయకుడు బొర్ర మాధ వరెడ్డి తదితరులతో కలిసి ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో వారు మా ట్లాడుతూ మతపరమైన విశ్వాసాలను రాజకీయ ప్రయోజనాల కోసం బిజెపి వక్రీకరించడాన్ని ఖండించారు. నియోజకవర్గంలో దేవాలయాల అభివృద్ధికి సబితారెడ్డి విశేషంగా కృషి చేశారనీ బాలాపూర్ దేవతల గుట్టపై 45 అడుగుల ఆంజనేయ స్వామి విగ్రహాన్ని, కెసి తాండాల 40 అడుగుల పరమేశ్వరుని విగ్రహాన్ని ఏర్పాటు చేయించారని వారు గుర్తు చేశారు. అదే విధంగా నియోజకవర్గంలోని 8 ప్రధాన పురాత నమైన ఆలయాల అభివృద్ధికి గత బిఆర్ఎస్ పాలనలో కోట్లాది రూపా యలను మంజూరు చేయించారని వివరించారు. రాజకీయ ప్రయోజ నాల కోసం సబితా ఇంద్రారెడ్డిపై అసత్య ప్రచారం చేస్తే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని వారు హెచ్చరించారు.

## కాంగ్రెస్ మోసాలపై బిఆర్ఎస్ బాకీ కార్డు ఉద్యమం : ఎమ్మెల్యే

**ఉప్పల్, అక్టోబరు 8 ప్రభాతవార్త**

కాంగ్రెస్ పార్టీ చేస్తున్న మోసాలపై బిఆర్ ఎస్ ఆధ్వర్యంలో బాకీ కార్డు ఉద్యమం చేపట్టినట్లు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధ వారం బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో బాకీ కార్డు ఉద్యమం చేపట్టారు. వ్యాపారులు, మహిళలను కలిసి బాకీ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు హామీల పేరుతో బాకీ పడ్డ మొత్తాన్ని తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. అమలు కాని హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన తరువాత హామీలను నెరవేర్చకుండా ప్రజలకు



ప్రజలకు బాకీ కార్డులను అందజేస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నేతలు

లక్షలాది రూపాయలను బాకీపడ్డారని విమర్శించారు. మహిళలకు, యువతకు, వృద్ధులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు తులం బంగారం ఎప్పుడు ఇస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు బన్నాల గీత, పన్నాల దేవేందర్‌రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నేతలు గంధం నాగేశ్వర్‌రావు, బన్నాల ప్రవీణ్, పిల్లి నాగరాజు, కాలేరు జైనవీన్ పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వర్ష ప్రభావిత కాలనీల సమస్యలను పరిశీలించిన పారిజాత



బడంగ్‌పేట్ కాలనీల్లో పర్యటిస్తున్న మాజీ మేయర్ పారిజాత

**సరూర్‌నగర్, అక్టోబర్ 8 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లోని 1వ డివిజన్‌లో వర్ష ప్రభావిత కాలనీల్లో బుధవారం మాజీ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాజీ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్‌రెడ్డి, పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, సీనియర్ నాయకులు గట్టు బాలకృష్ణ, రాళ్ళగూడెం శ్రీనివాస్ రెడ్డి, పెద్దబావి బాబు సుదర్శన్‌రెడ్డి తదితరులతో పాటు కార్పొరేషన్ ఎఇఇ హరీష్, సానిటరీ ఇన్స్‌పెక్టర్ వంకాయల యాదగిరిలతో కలిసి నవయుగ కాలనీ, సాయికృష్ణ ఎన్‌క్లేవ్ కాలనీల్లో పాదయాత్రలు చేస్తూ పరిశీలించారు. ఈ మేరకు ఆయా కాలనీల్లో వర్షాల వల్ల ఉత్పన్నమైన సమస్యలతో ప్రజలు ఎదుర్కొం టున్న ఇబ్బందులను పరిశీలించారు. ఈ నేపథ్యంలో సమస్యలు తీర్చడానికి తీసుకోవాల్సి న చర్యలపై అధికారులతో మాజీ మేయర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నయనా చారి, యువజన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సామ వరుణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మాదిగ మంత్రినే కించపరిస్తే ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటి?: బొర్ర రవి మాదిగ

**సరూర్‌నగర్, అక్టోబర్ 8 ప్రభాతవార్త:** మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారి పట్ల అహంకార పూరితంగా వ్యవహరిస్తూ అనుచిత వ్యాఖ్యలు చేసే వారిని ఉపేక్షించేది లేదని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) రంగారెడ్డి జిల్లా మాజీ అధికార ప్రతినిధి, బాలాపూర్ మండల ఇంఛార్జి బొర్ర రవి మాదిగ స్పష్టం చేశారు. సాక్షాత్తు ప్రెస్ మీట్‌లోనే బిసి సంక్షేమం, రవాణా శాఖల మంత్రి పొన్న ప్రభాకర్ మాదిగ సామాజిక వర్గానికి చెందిన మంత్రి అడ్లూరు లక్ష్మణ్‌ను దున్నపోతు అని వ్యాఖ్యానించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. తెలంగాణ రాష్ట్రంలో సాక్షాత్తు మంత్రి హోదాలో ఉన్న మాదిగనే కించపరిస్తే ఇక సామాన్య మాదిగల పరిస్థితి ఏమిటని ఆయన ప్రశ్నించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ వైఖరిని యావత్ మాదిగ సామాజిక వర్గం తీవ్రంగా ఖండించాలని ఆయన కోరారు. ఇలాంటి అహంకార ధోరణితో ఉండే మంత్రి వల్ల దళితులు, బడుగు, బలహీన వర్గాలు, వెనుకబడిన వర్గాల మధ్య దూరం పెరుగుతుందని రవి ఆందోళన వ్యక్తం చేశారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన పొన్నం ప్రభాకర్ క్షమాపణలు చెప్పడం కొంత ఊరట కలిగించినా ముమ్ముందు ఇలాంటి వ్యాఖ్యలు ఎవరు చేసినా మాదిగ సామాజిక వర్గం చూస్తూ ఊరుకోదనీ పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ కనుసైగలతో రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేస్తుందని ఆయన హెచ్చరించారు.

## డాక్టర్ బయ్యారపు సురేందర్ వర్మకు నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డ్




రైట్ అప్: డాక్టర్ బయ్యారపు సురేందర్ ను అభినందిస్తున్న కూరెళ్ళ మహేష్ కుమార్ తదితరులు

**మలక్ పేట ,అక్టోబర్ 8, ప్రభాతవార్త:**

ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రఖ్యాత సంస్థ ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరే షన్ వారు అందించే ప్రతిష్టాత్మకమైన నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డు2025 యూకేబి కళాశాల గోధుమ కుంట గ్రామం, కీసర మండలంలో ప్రిన్సిపల్ గా పనిచేస్తున్న బయ్యారపు సురేందర్ వర్మను వరించింది. ఈ అవార్డు అందుకోవటం పట్ల కళాశాల యాజమాన్యం డైరెక్టర్ ఉదయ్ కుమార్, కరస్పాండెంట్ డాక్టర్ విద్య స్రవంతి, పలువురు ఉపాధ్యాయులు తదితరులు ఆయనకు అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కూరెళ్ళ మహేష్ కుమార్ ఆధ్వర్యంలో ఆయనకు పుష్పగుచ్ఛలను అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కూరెళ్ళ మహేష్ కుమార్ మాట్లాడుతూ డాక్టర్ బయ్యారపు సురేందర్ వర్మ 2007 సంవత్సరం నుండి లెక్చరర్ గా పనిచేస్తూ 2015 లో ప్రిన్సిపల్ గా పదోన్నతి పొంది విద్యా విధానంలో తన వంతు పాత్ర పోషిస్తూ వందలాదిమంది ఉపా ధ్యాయులను ఈ సమాజానికి అందిస్తూ భావి భారత పౌరులను తీర్చిదిద్దుటలో అలుపెరగని చేయ డంతో నేషనల్ బెస్ట్ టీచర్ అవార్డుకు లభించిందని తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఎడ్యుకే షన్ లో డాక్టరేట్ పొందడం జరిగిందని, నేషనల్, ఇంటర్నేషనల్, సెమినార్స్ లో పాల్గొని గణిత బోధన పద్ధతి లు పుస్తకాలను రచించి బోధన వృత్తి ద్వారా సమాజ శ్రేయస్సు పట్ల తన కృషిని గుర్తిం చి ఏఐసిఎఫ్ వారు ఈ అవార్డును ప్రధానం చేయడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా విద్యావం తులు, మేధావులు, రీసెర్చ్ స్కాలర్స్ ఏఐసిఎఫ్ ఫౌండర్ విజయ రాజు గద్దపాటిని అభినందించడం అభినందించారు. ఈ కార్యక్రమంలో గదరాజు చందు, డాక్టర్ వీరస్వామి, శనిగరపు బాలకృష్ణ, సేవాలాల్ సేన రాష్ట్ర కార్యదర్శి లాలూ ప్రసాద్, కూరెళ్ళ మహేష్ బాబు, సైదులు పాల్గొన్నారు.

## గంజాయితో పట్టుబడ్డ ఇద్దరు వ్యక్తులు అరెస్ట్

**మేడిపల్లి , అక్టోబర్ 9 ప్రభాతవార్త :**

గంజాయితో యాక్టివా బై అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసిన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మేడిపల్లి పోలీస్ స్టేషన్ సిబ్బంది బుధవారం ఉదయం మేడిపల్లి ప్రశాంత్ నగర్ ఏరియాలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఇద్దరూ వ్యక్తులు నిర్మానుష్య ప్రాంతంలో యాక్టివా పై అనుమానాస్పదంగా తిరుగు తుండగా పోలీసులు వెళ్లి చూడగా వారి దగ్గర గంజాయి లభించింది. ఆ వ్యక్తులను పోలీస్ స్టేషన్ కు తరలించి విచారించగా ఘట్కేసర్ మండలం ఘనపూర్ కు చెందిన అన్నబోయిన కిరణ్ కుమార్ (31), మేడిపల్లి క్రాంతి కాలనీకి చెందిన బక్కి నవీన్ (26)గా తెలిపారు.వారిని అదుపులోకి తీసుకొని వారి దగ్గర 65 గ్రాముల గంజాయి,ఒక యాక్టివా బైకు,సెల్ ఫోన్లు సీజ్ చేసి చట్ట ప్రకారం వారిపై కేసు నమోదు చేసి రిమాండ్కు తరలించడం జరిగిందని మేడిపల్లి సీఐ గోవిందరెడ్డి తెలిపారు. ఈ సందర్భం గా సీఐ మాట్లాడుతూ... మత్తు పదార్థాలకు, గంజాయికి యువత దూరంగా ఉండాలని, డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపుతామని,పోలీస్ స్టేషన్ పరిధిలో ఇప్పటికే బృందాలుగా ఏర్పడి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని,డ్రగ్ రహిత సమాజం కోసం పాటుపడాలన్నదే తమ ధ్యేయమని,ప్రజలు స్వచ్ఛం దంగా ముందుకు వచ్చి గంజాయి,డ్రగ్స్,మత్తు పదార్థాలు త్రాగే వారు, సేవించేవారు, విక్రయాలకు పాల్పడే వారి సమాచారాన్ని డయల్ 100 ద్వారా పోలీస్ వారికి అందించాలని కోరారు.